ప్రజాశక్తి
శనివారం 18 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం

ఇద్దరు హెచ్‌ఎంల సస్పెన్షన్ ?

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఇద్దరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. సాలూరు మండలం మామిడిపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఇంఛార్జి హెచ్ఎం సంతోషిని ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు తెలిసింది. రెగ్యులర్ హెచ్ఎం సీతారాం సెలవులో వుండడం తో సంతోషి ఇంఛార్జి హెచ్ఎంగా వున్నారు. పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని తాడంగి పల్లవి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని ఉన్నతాధికారుల కు తెలియజేయలేదనే కారణంతో ఆమెను సస్పెండ్ చేశారు. మక్కువ మండలం ఎర్రసామంతలవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి తాడంగి చిన్నారిమృతి చెందడం వెనుక ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వుందనే కారణం తో పాఠశాల హెచ్ ఎం పుష్పనాథం పై కూడా చర్యలు తీసుకుంటారనే వాదనలు వినిపిస్తున్నాయి.

మానవత్వం లేని ప్రభుత్వం

- మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం చెల్లించాలి
- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ
- గురుకుల విద్యార్థినులకు పరామర్శ
- వైసిపి తరపున రూ.5లక్షలు చొప్పన చెక్కులు అందజేత

ప్రజాశక్తి-కురుపాం, పార్వతీపురం

రాష్ట్రంలో కనీస మానవత్వం లేని ప్రభుత్వం కొనసాగుతోందని విధాన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఇటీవల పచ్చకామెర్ల వ్యాధి బారిన పడి కురుపాం మండలం దండుసూరిలో మృతి చెందిన విద్యార్థులు తోయక అంజలి, తోయక కల్పన కుటుంబ సభ్యులకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసిపి తరపున ఒక్కొక్క కుటుంబాలకు రూ.5లక్షలు ప్రకటించిన నేపథ్యంలో మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో శుక్రవారం బొత్స చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థులను బొత్సతో పాటు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం లు రాజన్నదొర, పుష్పశ్రీవాణితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడు తూ ప్రభుత్వ ఏర్పడ్డాక విద్య, వైద్యానికి తూట్లు పొడుస్తోందన్నారు. వారి వ్యక్తిగత అభివృద్ధిని చూసుకుంటున్నారే తప్ప, చేసిందేమీలేదని అన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురికావ డంపై ప్రభుత్వం చాలా ఉదాసీనంగా వ్యవహరించిం దని చెప్పారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో కలుషిత నీరు వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడి మృతి చెందారని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇదేమీ గిరిశిఖర గ్రామం కాదని, మైదాన ప్రాంతంలో ఉన్న పాఠశాలలో నీరు కలుషితమని చెప్పుకోవడమేమిటని ప్రశ్నించారు. కనీసం విద్యార్థులకు తాగునీరు సక్రమంగా అందించ లేకపోతే ఈ రాష్ట్రాన్ని ఎలా పరిపాలిస్తారన్నారు. ఇద్దరు విద్యార్థినులు మరణించిన తరువాత కూడా ప్రభుత్వం అప్రమత్తం కాలేదన్నారు. కనీసం తల్లిదం డ్రులకు ప్రభుత్వం భరోసా ఇవ్వలేదన్నారు. బాధ్యులైన గిరిజన శాఖ మంత్రి గానీ, విద్యాశాఖ మంత్రి గానీ విద్యార్థుల కుటుంబాలను ఎందుకు పరామర్శించలేకపోయారని అన్నారు. వారం రోజుల తర్వాత మంత్రులు పాఠశాలను, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల పరామర్శ చేయడం శోచనీయమన్నారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులు పూర్తిగా కోలుకోకముందే పార్వతీపురం జిల్లా ఆసుపత్రి కి పంపించడం సరైన విధానం కాదన్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తర్వాత నే డిశ్చార్జి చేయాలన్నారు. నిరుపేద గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు.వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి మానవతా దృష్టితో మృతుల కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున పరిహారం ప్రకటించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఆ పని చేయక పోతే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పరిహారం చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జోగా రావు, విశ్వరాయ కళావతి, శంబంగి చినప్పల నాయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చెక్‌ను అందజేస్తున్న బొత్స, పుష్పశ్రీవాణి, చిన్నశ్రీను

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

సాలూరు ప్రాంతంలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 21 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక వైద్యులను విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి వైద్యుల సమ్మె కారణంగా వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులను సాలూరు సిహెచ్‌సికి తరలించారని, ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరు పచ్చకామెర్లతోనూ, ఒకరు మలేరియాతో బాధపడుతున్నారని, మిగిలిన విద్యార్థులు సాధారణ జ్వరం, అలసట వంటి తేలికపాటి సమస్యలతో ఉన్నారని వైద్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులకు కొన్ని ముఖ్య సూచనలు చేస్తూ విద్యార్థులు పూర్తిగా కోలుకొనే వరకూ మెరుగైన వైద్యం కొనసాగించాలని, వారి ఆరోగ్య పరిస్థితి తనకు ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. చిన్నారులు డిశ్చార్జ్ అయ్యేంత వరకు జాగ్రత్తగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, పాఠశాలల్లో ఆహారం నాణ్యత, తాగునీటి పరిశుభ్రత, వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే అంశాలపై పూర్తిస్థాయిలో సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఏ ఒక్క విద్యార్థి అనారోగ్యంతో బాధపడకుండా ఉండేలా ప్రభుత్వం ఒక చర్యలు తీసుకుంటుందని తల్లిదండ్రులు ఎటువంటి భయాందోళనలు చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మీనాక్షి, వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

డిడి కార్యాలయం ఎత్తివేతకు రంగం సిద్ధం?

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డిడి) కార్యాలయం శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోకి తరలిపోవడానికి అధికారులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు: గతంలో మూడుసార్లు డిడి కార్యాలయం శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి తరలించడానికి జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అప్పట్లో ప్రజాప్రతినిధులు ఉంచమనడంతో నిలిపివేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో ఒక గదిలో డిడి కార్యాలయం నిర్వహించాలని శ్రీకాకుళం జిల్లా అధికారులు చెప్పడంతో డిడి కార్యాలయాన్ని పరిశీలించడానికి హుటా హుటిన బయలుదేరారు. అలాగే స్థానిక డిడి కార్యాలయం పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టుమెట్రిక్ వసతి గృహాల పరిధి సుమారు 15 వేలమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలో పర్యవేక్షణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని డిడి పర్యవేక్షణ చేయాల్సి ఉంది. గతంలో సీతంపేటలోనే డిడి కార్యాలయం ఉంచాలని గిరిజనులు ఆందోళనకూ కూడా చేశారు.

ఈ విషయంపై డిడి ఎం అన్నదొర వద్ద ప్రస్తావించగా డిడి కార్యాలయం శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోకి తరలిపోవడం వాస్తవమేనన్నారు. డిసెంబర్ నాటికి వెళ్లిపోవచ్చని, కార్యాలయాన్ని పరిశీలించడానికి వెళ్తున్నానని సమాధానం ఇచ్చారు.

నాణ్యతలేని గుడ్లు.. విద్యార్థులకు రావా రోగాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేస్తున్న గుడ్లు నాణ్యత లేకపోవడంతో వండేసరికి నల్లటి రంగులోకి మారుతున్నాయి. చెడిన గుడ్లని తింటే విద్యార్థులకు రోగాలు రావా అనే ప్రశ్న వినిపిస్తోంది. కాలం చెల్లిన గుడ్లను వసతి గృహాలకు సరఫరా చేయడంతో కుళ్లిన గుడ్లు విద్యార్థులకు వండి పెడితే వ్యాధులు బారిన పడక తప్పదని వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగానే దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఉడకబెట్టిన గుడ్లు నల్లగా మారాయిని వార్డెన్ తెలిపారు. వందలాది మంది విద్యార్థుల ఆరోగ్య రక్షణ దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయాల్సిన కాంట్రాక్టర్ నిల్వ ఉన్న గుడ్లు పంపిణీ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వార్డెన్లు చెబుతున్నారు. నాణ్యతలేని గుడ్లు విషయమై ఎన్నోసార్లు జిసిసి అధికారులకు, టెండర్‌దార్లకు చెబుతున్నా పట్టించు కోవడం లేదని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

విద్యార్థుల సంరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే : జెసి

ప్రజాశక్తి-పార్వతీపురం

అనారోగ్య కారణాలతో వసతి గృహ విద్యార్థులు హాస్టల్ నుండి బయటకు అడుగుపెట్టిన దగ్గర నుంచి తిరిగి ఆరోగ్యవంతులుగా హాస్టల్ లోపలికి అడుగుపెట్టే వరకు సంబంధిత ఉపాధ్యాయులే పూర్తి బాధ్యత వహించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి చెప్పారు. పిల్లల ఆరోగ్య వివరాలను ముందుగా తల్లితండ్రులకు తెలియ జేయాలని, అవగాహన లోపంతో తల్లితండ్రులు పిల్లలకు నాటు వైద్యం ఇప్పించకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయదచీశీఅవగు సమావేశ మందిరంలో హాస్టల్ వార్డెన్లు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దష్టి సారించడం ద్వారా ఎటువంటి సంఘటనలు సంభవించవని అన్నారు. పోషకాహార లోపం, వయసుకు తగిన బరువు, ఎత్తు లేకపోవడం, ఎనీమియా, సికిల్ సెల్, తలసేమియా వంటి పలు కారణాలతో ఎక్కువగా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. అటువంటి సమస్యలు లేకుండా విద్యార్థులకు ప్రతీ మూడు మాసాలకు ఒకసారి వైద్య సిబ్బందితో రక్త పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆడపిల్లల్లో హెమోగ్లోబిన్ 10 శాతం కంటే తక్కువగా ఉండరాదని, అటువంటి వారిపై ప్రత్యేక శ్రద్ధను కనబరచి రక్తం పెరిగేలా మాత్రలను, పోషకాహారాన్ని అందించాలని అన్నారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైతే అర్ధరాత్రి సమయంలోనైనా స్థానిక ప్రభుత్వ వైద్యులు వచ్చి పరిశీలించేలా, వైద్యులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మీ ప్రాంతంలో ఉన్న వ్యాపారవేత్తలు, దాతల సహకారంతో మీ వసతి గృహంలో కావలసిన చిన్నపాటి మౌలిక వసతులను కల్పించుకోవచ్చని తెలిపారు.

సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎ.విజయశాంతి, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.ఎస్.పద్మావతి, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు ఆర్.కృష్ణవేణి, రజనీ, పిఎంఆర్‌సి ఎఎంఒ పుష్పనాథం, హాస్టల్ వార్డెన్లు, ప్రధాపోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అదికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

పార్వతీపురం : పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ పట్ల చేపట్టాల్సిన కార్యక్రమాలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకోసమే ఫ్రైడే, డ్రైడే కార్యక్రమని, దీని ప్రాధాన్యతను విద్యార్థులకు స్పష్టంగా వివరించాలని సూచించారు. మండలంలోని డోకిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను జెసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన ఫ్రైడే డే కార్యక్రమాన్ని పరిశీలించారు. మురుగునీటి కాలువలు, పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించి ఆరోగ్య, ఇతర సిబ్బందికి జేసీ పలు సూచనలు, మార్గదర్శకాలను జారీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిలిచి, దోమలు వృద్ధి చెందకుండా నివారించడం ద్వారా డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడం ఫ్రైడే డ్రైడే లక్ష్యమని అన్నారు. ప్రతి శుక్రవారం పరిసరాల్లోని నిల్వ ఉన్న నీటిని తొలగించి, ఆ ప్రాంతాన్ని పొడిగా ఉంచాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి అని, దాన్ని విద్యార్థులు పాటించేలా అవగాహన కల్పించాలని జేసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న జెసి

ఎఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఆటో డ్రైవర్ల సేవలో పథకం అమలు చేయాలి

సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని పలు కారణాలతో నిలిపివేసిన లబ్ధిదారులందరికీ ఆ పథకాన్ని అమలు చేయాలని స్థానిక కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉండగా కేవలం 2లక్షల 96 వేల మందికి మాత్రమే ఆటో డ్రైవర్ల సేవా పథకం ద్వారా నగదు సహాయం అందించారని, మిగిలిన వారికి రకరకాల కారణాలు చూపించి ఈ పథకాన్ని దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మిగిలిపోయిన వారందరికీ నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉచిత బస్సు పథకం వల్ల సర్వీసులు కోల్పోయి, ఆదాయాలు రాక తీవ్ర ఇబ్బందుల్లో ఆటో కార్మికులు ఉన్నారని, ప్రభుత్వం ఇచ్చిన అతి తక్కువ సహాయం కూడా పూర్తిస్థాయిలో అందించకపోవడం విచారకరమని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు వేసి సమగ్రమైన పరిశీలన చేసి ఆటో డ్రైవర్లందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిరు ఉద్యోగులైన అంగన్వాడీ, ఆశా, ఐకెపి తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారి కుటుంబాలకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయక పోవడం దుర్మార్గమని, ఇలాంటి సాంకేతిక కారణాలన్నింటినీ తొలగించి తక్షణమే ఆటో కార్మికులందరికీ ఆటో కార్మికుల సేవా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, ఆటో కార్మిక సంఘం నాయకులు బి.సూరిబాబు, బిరామారావు, సంచాన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడ్ని రప్పించేందుకు చర్యలు చేపట్టాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-పాచిపెంట

జమ్మూ కాశ్మీర్‌లో చిక్కుకుపోయిన పెద్దగడ్డ జలాశయం నిర్వాసిత గ్రామం ఎర్రడ్ల వలసకు చెందిన గిరిజనుడు బడ్నాన చిన్నారావును తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు జన్ని రామయ్య డిమాండ్ చేశారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించి ఆయన శుక్రవారం చిన్నారావు తల్లి బడ్నాన చిన్నమ్మిని పరామర్శించారు. కుమారుడు రాలేదని ఆమె మంచం పట్టింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారావును భద్రంగా తీసుకొచ్చి అప్పగిస్తామని చెప్పిన జిల్లా అధికారులు మాట తప్పారని, ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. చిన్నారావును గత ఏడాది పనులు కోసం ఒక వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నుండి కృష్ణ అనే వ్యక్తి వచ్చి టంగుటూరు ప్రాంతానికి రొయ్యలు చెరువులు పనుల కోసం తీసుకువెళ్లి నిర్లక్ష్యంగా వదిలేయడం వలన తప్పిపోయాడని తెలిపారు. జమ్మూ కాశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది వద్ద ఉన్నట్లుగా స్థానిక పోలీసులు తెలిపారని చెప్పారు. ఈ విషయంపై సిపిఎం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గౌరవ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం ఇవ్వగా ఆయన స్పందించి భద్రంగా చిన్నారావుని కుటుంబ సభ్యులకి అప్పగిస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ రెవెన్యూ యంత్రాంగం ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఆ కుటుంబ సభ్యులు పేదవారు కావడంతో వెళ్లి రావడానికి కూడా ఆర్థికమైన సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో చిన్నారావును రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం, గిరిజన సంఘం నాయకులు

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు ఉపాధ్యాయులు, నిర్వాహకులు

ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో శుక్రవారం క్వాంటం యుగం ప్రారంభం- అవకాశాలు, పరిమితులు అనే అంశంపై జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ ముగిసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు అధ్యక్షతన, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని మండలాల నుంచి ఇద్దరు చొప్పున 30 మంది విద్యార్థులు, 30 మంది గైడ్ టీచర్లు పాల్గొన్నారు. పరిశీలకులుగా హాజరైన బలిజిపేట ఎంఇఒ మాట్లాడుతు ఇలాంటి సైన్స్ సెమినార్లు విద్యార్థులులో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొదిస్తాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణ రావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజానికి అవసరమైన అంశాలపై ఇటువంటి సెమినార్లు పెట్టడం ఎంతో ప్రయోజకరమని విద్యార్థుల్లో దాగిఉన్న సృజనత్మాకతను వెలికితీస్తుందని అన్నారు. సంప్రదాయ ఫిజిక్స్ నుండి క్వాంటం ఫిజిక్స్‌కు మారుతున్న తరుణంలో అంతే వేగంతో అభివృద్ధి జరిగి ఫలాలు అందరికీ అందుతాయని అన్నారు. జిల్లా ఎన్‌జిసి కో ఆర్డినేటర్ గోండేల రాజారావు మాట్లాడుతూ సమాజ ఉన్నతికి సైన్స్ ఎంతో దోహదపడుతుందని, దీన్ని సక్రమంగా వియోగించుకోవాలని అన్నారు.

సెమినార్‌కు జ్యూరీ సభ్యులుగా బి.చిన్నం నాయుడు, ప్రదీప్ కూమర్ పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో మొదటి రెండు స్థానాలు పొందిన విద్యార్థులు శనివారం విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీలో జరగనున్న రాష్ట్ర స్థాయి సెమినార్ కు హాజరు కావాల్సి ఉందన్నారు.

గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుమ్మంగి పంచాయతీ కోసింగిభద్రలో శుక్రవారం 104 మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. టిబి, బిపి, షుగర్, జనరల్ ఒపి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, గుణద, టెంక సింగి, కోసింగి భద్ర గ్రామాల ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 2.60 కోట్లతో పర్యాటక ప్రాంతంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పంచాయతీ ఎగువ తాడికొండ సమీపానున్న మొగనాలి గెడ్డ పర్యాటక ప్రాంత అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. భద్రగిరి ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల 60 లక్షలతో అభివృద్ధి పనులు పడుతున్నట్లు ఎఇ అప్పారావు తెలిపారు. పర్యాటక ప్రాంతానికి వచ్చే సందర్శకుల వాహనాలు రాకపోకలకు వీలుగా ప్రధాన రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారికి సమీపాన రిటర్నింగ్ వాల్స్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. కాఫీ అండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, మరుగుదొడ్లు, పగోడా వంటివి పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయి.

వైద్యుల్లేక వెలవెలబోతున్న పిహెచ్‌సి

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సమ్మె బాట పట్టడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలో దూరమయ్యాయి. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. అత్యవసర సమయంలో అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని రోగులు చెబుతున్నారు. సమ్మెబాట పట్టకముందు ఈ ప్రాథమిక వైద్య కేంద్రంలో సుమారుగా 100కు పైగా ఒపి ఉండేది. ప్రస్తుతం వైద్యులు సమ్మెబాట పట్టడంతో పది అంకెలకు చేరుకుంది.



వైద్యులేక బోసిపోయిన పిహెచ్‌సి

సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, ఛైర్మన్ రవికుమార్

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి వీరఘట్టం

సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లు వంటిదని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం వీరఘట్టంలో శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ. సమస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కె.రవికుమార్ మాట్లాడుతూ వీరఘట్టం గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, జనసేన జానీ, ఉమామహేశ్వరరావు, రత్నాకర్, టి రమేష్, జంపు చంద్రశేఖర్, సిహెచ్ శ్రీనివాసరావు, కె.పైడిరాజు, ఎస్ శశిభూషణరావు, బి అశోక్, ఎస్ అచ్యుత రావు, కే సాయి పవన్ ,జి నరేంద్ర, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్లకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మండలం ఆర్వో వాటర్ ప్లాంట్లు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మూలన పడి ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో స్టోర్ రూమ్‌లో పెట్టి తాళం వేశారని చెప్పారు. మరమ్మతు చేయకపోవడంతో విద్యార్థులకు రక్షిత మంచినీటి కష్టాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే మన్యం జిల్లాలో సుమారుగా 15 మంది విద్యార్థులు పచ్చకామర్లు, జ్వరం, కడుపునొప్పితో చనిపోయారని చెప్పారు. ఇంత జరిగినా ఈ ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందన్నారు. గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మొదటి సంతకం చేసిన ఫైలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 170మంది గిరిజన విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు .

ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో అమలవుతున్న ఉపాధిహామీ చట్టాన్ని ప్రభుత్వం పగడ్బందీగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ డంగభద్రలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ శుక్రవారం ఎస్.పెంటయ్య అధ్యక్షతన జరిగింది. అనంతరం 12 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. సంఘం మండల కార్యదర్శిగా కొల్లి సాంబమూర్తి ఎన్నుకున్నారు. అనంతరం ఈనెల 22న పార్వతీపురంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభల జయప్రదానికి వ్యవసాయ కార్మికులు, రైతులు, మేధావులు, అభ్యుదయవాదులు ఆర్థిక, హార్దిక సహకారంతో జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల ప్రతి ఆశ్రమ స్కూల్, వసతి గృహాల్లో ఆరోగ్య సిబ్బంది, హెల్త్ వాలంటీర్లను నియమించాలని ఆదివాసీ జెఎసి ఆరోగ్య కార్యాకర్తల అధ్యక్షులు బిడ్డిక. రామమోహనరావు డిమాండ్ చేశారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలోనూ, నియోజకవర్గ పరిధిలో సుమారుగా ఆరుగురు విద్యార్థులు మరణించారన్నారు. పదుల కొద్దీ మంచానికి పరిమితమై ఉన్నారన్నారు. సకాలంలో హాస్పిటల్‌కు తీసుకెళ్లే నాధుడు కరువయ్యారని, పర్యవేక్షణ లేదని అన్నారు. వెంటనే హెల్త్ వాలంటీర్లు ను నియమించాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సూరంపేట, చినబోగిలిలో డ్రైడే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట, చిన్నబోగిలిలో ఫ్రైడే, డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ఈ కార్యక్రమంలో మురుగునీరు తొలగింపు బకెట్లు డబ్బాల్లో ఉండే నీళ్ల తొలగించి అంటువ్యాధులు పగలకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.తిరుపతిరావు, పి.మురళీకృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒఆర్‌ఎస్‌పై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒఆర్‌ఎస్‌పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు ఈ సందర్భంగా ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్స్ కాంతి కుమార్ మనోహర్ మాట్లాడుతూ పంచాయతీ ఆదాయ వనరులు సేకరణ వివరించారు. పంచాయతీలో 406 రకాల నుంచి ఆదాయ వనరులు సేకరించొచ్చని అన్నారు. పంచాయతీ అభివృద్ధి, ఆదాయాన్ని బట్టి ఖర్చును వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఎఒ వెంకటరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ఫాల్స్ వద్ద అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు.

మండలంలోని కురుకుట్టి పంచాయతీ దళయివలస వాటర్ ఫాల్స్ వద్ద గ్రామస్తులు స్వచ్ఛందంగా చేస్తున్న అభివృద్ధి పనులను డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత మహిళా సంఘాలకు కలెక్టర్ అప్పజెప్పారని, ఇందులో భాగంగా దళాయివలస గ్రామస్తులు, మహిళలు, యువత చురుగ్గా ముందుకొచ్చి, దళాయివలస నుండి వాటర్ ఫాల్స్ వరకు 5కిలోమీటర్లు రహదారి వేశారని, అంతేకాకుండా వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటకులకు ఇబ్బంది పడకుండా దాటడానికి ఎదురు కర్రలతో బ్రిడ్జిలు నిర్మించారని, మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. దళాయివలస నుండి పర్యాటకులను వాటర్ ఫాల్స్ వద్దకు మోటారు వాహనాలతో తీసుకువెళ్ళడానికి యువత కూడా ముందుకు వచ్చారని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో జిల్లాలో ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దుతమని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం అంపల్లి జయమ్మ, గ్రామ సర్పంచ్ అప్పారావు టిడిపినాయకులు దొర లక్ష్మణ దొర గ్రామస్తులు పాల్గొన్నారు

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అక్రమంగా బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎన్.శేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనుమతుల్లేకుండా బాణాసంచా దుకాణాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దుకాణదారులు తప్పనిసరిగా ఇసుక, నీటి బకెట్లు, అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. బాణాసంచా నిల్వ ప్రదేశాలు సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ప్రజలు కూడా టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పిల్లలను పెద్దల పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. శానిటైజర్ వాడిన వెంటనే టపాసులు కాల్చరాదని, నైలాన్ దుస్తులు కాకుండా కాటన్ బట్టలు మాత్రమే ధరించాలని సూచించారు. అప్రమత్తతతోనే సురక్షిత, ఆనందకర దీపావళి జరుపుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

వయోజన విద్యా వాలంటీర్లు శిక్షణను వినియోగించుకోవాలని వయోజన విద్యాశాఖ డైరెక్టర్ వైకుంఠరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎంఎస్‌లో వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్షరాంధ్రలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 102మంది వాలంటీర్లకు హాజరయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చి పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిఎం కమలకుమారి, ఇసి పాండురంగ పాల్గొన్నారు.

పసుపు రైతులకు చేయూత

90 శాతం సబ్సిడీపై యంత్రాలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల పసుపు రైతులు తీపి కబురు త్వరలోనే విన బోతున్నారు. తక్కువ శ్రమ, తక్కువ సమయం, అధిక లాభం పొందడానికి సోలార్ పసుపు యంత్రాలు సబ్సిడీపై పంపిణీ చేయడానికి ఐటిడిఎ అధికారులు సన్నహాలు చేస్తున్నారు. యంత్రాల ద్వారా పసుపునకు పాలిష్ చేయడంతో మార్కెట్ ధర లభిస్తుంది. దీంతో ఏజెన్సీ పసుపు అంతర్జాతీయ ఖ్యాతికి వెళ్ళనుంది. ఇప్పటికే ప్రభుత్వం ఈ ఐటిడిఎకు రూ.95 లక్షలు మంజూరు చేసింది. గత ఏడాది హార్టికల్చర్ అధికారి ఎస్‌వి గణేష్ ప్రత్యేక చొరవతో ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే పసుపు రైతులు అధిక సాగు ఉంది. ఈ పసుపునకు మంచి గిరాకీ ఉందని, దీంతో పసుపు రైతుకు చేయూత ఇస్తే ఆర్థికంగా ముందుకు వెళ్తాడన్న ఉద్దేశించడంతో ప్రతిపాదనలు పంపించారు. అయితే ఐటిడిఎ అధికారులు ఇక టెండర్లు వేయాల్సి ఉంది. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 3,786 మంది రైతులు 6887 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. ఎకరానికి 1.4 మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, మొత్తంగా 9,642. మెట్రిక్ టన్నులు దిగిబడి వస్తుంది. 90 శాతం సబ్సిడీపై ఉడకబెట్టిన బాయిలర్ యంత్రాలు 80 రానున్నాయి. వీటివిలువ రూ.36 లక్షలు. సోలార్ డ్రయిర్స్ ఎండబెట్టిన యంత్రాలు 5 యూనిట్లు రూ.25 లక్షలు. పసుపు మినీ పాలిష్ 42 యూనిట్లు రూ.34 లక్షలు. ఇది రైతులకు 90శాతం సబ్సిడీలో రైతులకు ఇస్తారు. ఈ యంత్రాల ద్వారా గంటలో 100 కేజీలు పసుపు ఉడకబెట్టొచ్చు సింగల్ ఫేస్ మోటర్ కూడా ఇస్తారు.

సబ్సిడీపై అందజేయనున్న యంత్రం

పసుపు యంత్రాలు ప్రత్యేకత

గంటలో వంద కేజీల పసుపు ఉడుకుతుంది.

అన్ని కొమ్ములు ఒకే విధంగా ఉంటాయి అందంగా మారుతాయి

పసుపు క్వాలిటీ వస్తుంది మార్కెట్ ధర పలుకుతుంది

పసుపు కాకుండా ఏ వస్తువైన ఎండబెట్టొచ్చు డ్రై చేయవచ్చు.

రైతులు దరఖాస్తులు చేసుకోవాలి

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల పసుపు సాగు చేస్తున్న గిరిజన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. పసుపు పాలిష్ యంత్రం ఉడకపెట్టిన బాయిలర్స్ సోలార్ డ్రైయర్ రైతులకు 90శాతం సబ్సిడీపై అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఐటిడిఎలో దరఖాస్తు చేసుకోవాలి.

ఎస్.వెంకట గణేష్,
ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి, సీతంపేట ఐటిడిఎ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

భావితరాల భవిష్యత్తుకు మెరుగైన విద్య

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భావితరగాల భవ్విత్తు కోసం మెరుగైన విద్యను అందించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నూతన ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా నియమింపబడిన ఉపాధ్యాయుల థాంక్యూ సిఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది దేవుడు ఇచ్చిన గొప్ప వరమని, ఎవరైనా సరే ఉన్నత స్థాయికి వెళ్లాలంటే ఉపాధ్యాయుడే కారణమని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులుగా మీరు బాధ్యత తీసుకొని విద్యార్థులకు విలువలతో కూడిన విద్య బోధనలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో డిఇఒ బి.రాజ్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, ఎంపిపి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంఇఒలు చంద్రశేఖర్, భీముడు, హరి మాస్టర్, శంకర్రావు, ఎస్ఎంసి చైర్మన్ సొంటేనా రాజేష్, కూటమి నాయకులు క్రాంతి కుమార్, దొరబాబు, మన్మధ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీజన్ ఎమ్‌డి శ్రీనుకు అవార్డును అందజేస్తున్న విద్యావేత్తలు

శ్రీజన్ ఎమ్‌డికి అవార్డు

ప్రజాశక్తి- పార్వతీపురం

భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతి రోజున ప్రపంచ విద్యార్థి దినోత్సవం సందర్భంగా శ్రీజన్ గ్లోబల్ విద్యాసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉప్పిలి శ్రీను ప్రైవేట్ ఉత్తమ విద్యా సేవలకు గాను, ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారం అవార్డును విజయనగరం జిల్లా గజపతినగరంలో అందుకున్నారు. శ్రీ సత్య సాయి దివ్యామృతం ఆధ్వర్యంలో బాలాజీ విద్యాసంస్థల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ మురు ముత్యాల నాయుడు అధ్యక్షతన ప్రపంచ విద్యార్థి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి సూర్య ప్రకాష్ రావు, గౌరవ అతిథి టీచర్స్ ఎమ్మెల్సీ గాది శ్రీనివాస నాయుడు, పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి బి.విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదగా శ్రీను అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో తీర్చిదిద్దుకుంటుందన్న సూక్తి విద్యాసంస్థల స్థాపించి పేదవారికి కార్పొరేట్ విద్య అందుబాటులో సేవలు అందిస్తున్నందుకు గాను జిల్లా ఉత్తమ కరెస్పాండెంట్ అవార్డు అందడం విద్యాభివృద్ధిలో మరింత బాధ్యత పెరిగిందని, తమకు ఈ పురస్కారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు, శ్రీజన్ గ్లోబల్ విద్యాసంస్థ ఉపాధ్యాయులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్మార్ట్ కార్డుతో ఎక్కడైనా రేషన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-భామిని

వివిధ ప్రాంతాల్లో పనిచేసే భవన నిర్మాణ కార్మికులకు, వలస కూలీలకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగకరమని, ఈ కార్డుతో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉందని, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 14084 మంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి రేషన్ స్మార్ట్ కార్డులు అందించామన్నారు. మండలంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరరావు, అధ్యక్షులు రవి నాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ ప్రతినిధి లోపింటి రాజేష్, జనసేన మండల అధ్యక్షులు రుంకు కిరణ్, టిడిపి నాయకులు బిడ్డ ప్రసాద్, అంపిలి కేశవ, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

పార్వతీపురం టౌన్ : మండలంలోని నర్సిపురంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొట్టాపు గౌరీ, గొట్టాపు వెంకటరమణ టిడిపినాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని పరుశురామపురంలో కూటమి ప్రభుత్వం అందజేస్తున్న స్మార్ట్ రైస్ కార్డులను సర్పంచ్ మజ్జి సుజాత లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 504 స్మార్ట్ కార్డులు మొదట విడతలో వచ్చాయన్నారు. రెండో విడతలో ఇంకా 400కు పైగా కార్డు రావాల్సిందని తెలిపారు. కార్యక్రమంలో పంపిణీలో గ్రామ రెవెన్యూ అధికారి మహిపతి, టిడిపి సీనియర్ నాయకులు మజ్జి కిరణ్ లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

పాలకొండ : నగర పంచాయతీ పరిధిలో నాగవంశపు వీధి, సెగుడు వీధి ప్రాంతాల్లో గల రేషన్‌షాపులను తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి తనిఖీ చేసి అక్కడ పంపిణీ అవుతున్న స్మార్ట్ కార్డులను పరిశీలించారు. రేషన్ కార్డుదారులతో మాట్లాడి కార్డు ఎలా వాడాలో తహశీల్దార్ వివరించారు. అందరికీ సక్రమంగా కార్డులు అందించాలన్నారు. అనంతరం పట్టణంలోని పెద్దకాపు వీధి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలకు ఇక్కడే భోజనం అందించాలా చూడాలన్నారు. అదేవిధంగా వంట ఉండే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో శుభ్రం చేయాలని సూచించారు

ఎంబిఆర్ అండ్ అసోసియేట్స్ ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన చారిటీ అకౌంటెంట్ ఎంబిఆర్ అండ్ అసోసియేషన్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఇక్కడ అకౌంటింగ్, ఫుడ్ లైసెన్స్, జిఎస్టి రిటర్న్, ఇన్కమ్ టాక్స్ రిటర్న్, జిఎస్టి రిజిస్ట్రేషన్, కంపెనీ రిజిస్ట్రేషన్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, ఎంపిపి చైర్ పర్సన్ కడ్రక కళావతి, నాయకులు హరి, దొరబాబు, మన్మధ, జానకి తదితరులు ఉన్నారు.

వ్యకాస మహాసభను జయప్రదం చేయాలి

వీరఘట్టం: పార్వతీపురంలో ఈనెల 22న జరుగు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పదో మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కడకెళ్లలో సంఘం మండల అధ్యక్షులు ఎన్.సింహాచలం ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి, ఉపాధి కూలీలకు రూ.600 ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో చర్చించి కార్యచరణ రూపొందించి పోరాడుతుందని, ఈ పోరాటంలో ప్రజలంతా భాగస్వాములై ఈ మహాసభలకు సహాయ సహకారాలు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివ, రామకృష్ణ, జి.సత్యనారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారం నాయుడువలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మలేరియా వ్యాధి నిర్మూలనకు వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మలేరియా వ్యాపికి గల కారణాలు, వ్యాధి నివారణా చర్యలు, చికిత్స తదితర అంశాలపై ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మురుగునీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందకుండా నివారించడం ద్వారా డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడం ఫ్రైడే లక్ష్యమని తెలిపారు. ప్రతి శుక్రవారం పరిసరాలల్లోని నిల్వ ఉన్న నీటిని తొలగించి ఆ ప్రాంతాన్ని పొడిగా ఉంచాలని సూచించారు. కొబ్బరిచిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, పాత కుండలు ఇతర పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వివరించారు అలాగే వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి అని దానిని విద్యార్థులు పాటించేలాగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లత, ఆరోగ్య కార్యకర్తలు ఈశ్వరరావు, కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు భవాని, సాయి లీల, ఆశా వర్కర్లు లక్ష్మి, గంగ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు మోడల్ స్కూల్ విద్యార్థి

కురుపాం : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న నెల్లి శ్రీనిధి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శనివారం జరగనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు శ్రీనిధి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి శ్రీనిధికి ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తోటి విద్యార్థులు అభినందించారు.

సిజెఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా ఇన్చార్జి బి.మన్మదమాదిగ మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళింగ ప్రేమభూషణరావు, కళ్యాణ్ ప్రసాద్, రంజిత్ కుమార్, ఎన్.రాహుల్ కుమార్, ఎన్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

భామిని: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు స్థానిక తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పార్వతీపురం మన్యం జిల్లా ఇంచార్జ్ బోస్ మన్మధరావు మాదిగ, సభ్యులు లోపింటి రాజేష్, చింతాడ చరణ్, జిల్లేరు రవి, లోపింటి కిశోర్, బోయల ప్రకాష్, రాజు పాల్గొన్నారు.

ప్రజల కోసమే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్‌కు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజల నుంచి వచ్చి మంచినీటి, రోడ్డు సౌకర్యం తదితర సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సమస్యల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

ఎరువులు ఎక్కువగా వాడకూడదు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు విచక్షణారహితంగా ఎరువులు వాడినట్లయితే భూమి, మనుషుల ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా పెట్టుబడులు అధికం అవుతాయని, కావున రైతులు సరిపడా ఎరువులు మాత్రమే వాడుకోవాలని సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో మండలంలోని మతుమూరు, కోణం బంధవలసలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలో ఆధునిక వ్యవసాయ రైతులు గట్లపై ఇంటి పెరట్లో కూరగాయలు పండించాలని తిండి గింజలను పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండించుకోవాలని సూచించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంట మార్పిడి విధానాలు, అంతర్ పంటల ద్వారా నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. రైతులు సాగు ఖర్చులు తగ్గించే దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. విజయనగరం వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ తేజేశ్వరరావు, డాక్టర్ తేజేశ్వరరావు మాట్లాడుతూ ఎరువులను సకాలంలో సరైన పద్ధతిలో తగిన మోతాదులో వాడుకోవాలని, పురుగుమందులను విచక్షణారహితంగా పిచికారీ చేయకూడదని సూచించారు. రైతులు వ్యాపారవేత్త స్థాయికి ఎదిగేలా పంటల సరళిని మార్చుకుని వినూత్న పద్ధతిలో కొనసాగాలని తెలిపారు. అనంతరం రైతులకు కూరగాయల నారు మొక్కలను పంపిణీ చేశారు. వరిలో దోమ పోటు నివారణకు ఎలాంటి ఖర్చు లేకుండా సమర్ధవంతంగా పనిచేసే తూటికాడ కషాయాన్ని తయారు చేయించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎ గోపాలకృష్ణ, వేణు, ప్రకృతి సేద్య సిఆర్పి తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, మరణాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు ప్రజా, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు ఐదో రోజు శుక్రవారం కొనసాగించారు. ఈ సందర్భంగా "మెడ పై ఉరితాళు "వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం గా, బాధ్యత లేకుండా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్, పిడిఎస్‌ఒ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.విశ్వనాథ్, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం, తదితరులు పాల్గొన్నారు.

మెడకు తాడు వేసుకొని నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

చిరు ధాన్యాలతో ఎంతో మేలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలంలోని పెదమేరంగిలో శుక్రవారం రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్ర గృహవిజ్ఞాన విభాగ శాస్త్రవేత్త ఉమాజ్యోతి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలనా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళలు, మహిళా రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉమాజ్యోతి చిరుధాన్యాల వినియోగించడం వలన కలిగే ప్రయోజనాలను జొన్న రవ్వను అల్పాహారంగా ఉపయోగించడం వల్ల డయాబెటిస్ (షుగర్) వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలన్నారు. అలాగే జీర్ణకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకూ దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా ఈ చిరు ధాన్యాల ను ప్రథమ ఆహారంగానే కాకుండా చిన్నారులకు ఇచ్చే తినుబం డారాలుగా తయారుచేసి ఇవ్వడం వల్ల వారి ఆరోగ్యం మరింత మెరుగవు తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళలు మహిళా రైతులు పాల్గొన్నారు.

దాడులు అమానుషం

పాలకొండ: సాక్షి కార్యాలయాలపై దాడులను నిరసిస్తూ శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కల్తీ మద్యంపై వార్తలు రాసిన విలేకరులపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు కామేశ్వరరావు, సభ్యులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరివేసుకొని మృతి చెందిన లక్ష్మణరావు

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలోని గొర్లి వీధికి చెందిన రైతు గొర్లి లక్ష్మణరావు (55) శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎప్పటిలాగే సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న తన పొలానికి వెళ్లిన లక్ష్మణరావు అక్కడ కళ్లంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆవులను కట్టేందుకు వెళ్లిన కుమారుడు అనంతకుమార్ చెట్టుకు వేలాడిన తండ్రి మృతదేహాన్ని చూసి, కొనఊపిరితో ఉన్నట్లు గమనించి అక్కడ నుంచి బయటకు తీసి చూసేసరికి తండ్రి మృతి చెందినట్లు గుర్తించి బోరున విలపించాడు. దీంతో ఇంటికి సమాచారం చేరడంతో భార్య సీతాలక్ష్మి భర్త శవం వద్ద రోధిస్తున్న తీరు చూపరుల హృదయాలను కలచివేసింది. కొద్ది రోజుల క్రితం లక్ష్మణరావు కోడలు కుటుంబ సభ్యులపై తనను వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో మనస్థాపానికి గురై తన తండ్రి మృతి చెందినట్లు కుమారుడు అనంతకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటరమణ చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ గ్రామానికి చెందిన రైతు కిల్లక మౌళికి పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా బైక్ ఢీకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపుగా ఎదురుగా వస్తున్న బైకు మౌళిని బలంగా ఢీకొంది. కంటికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
E.A.No.15/2025 IN E.P.No.3/2024 IN O.S.No.53/2023

Between:
కట్టమూరి శ్రీనివాసరావు ....పిటీషనరు
And:
1. కర్రీ దుర్గా ప్రసాద్ రెడ్డి
2. కట్టమూరి ఈశ్వరరావు
3. కట్టమూరి సీతామహాలక్ష్మి ... రెస్పాండెంట్లు

నోటీసు

2వ రెస్పాండెంట్: కట్టమూరి ఈశ్వరరావు, S/o లేటు అప్పలరాజు, చర్చి దరి, మెయిన్ రోడ్డు, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

3వ రెస్పాండెంట్: కట్టమూరి సీతామహాలక్ష్మి, W/o ఈశ్వరరావు, చర్చి దరి, మెయిన్ రోడ్డు, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు వ్యాజ్యములో పిటీషనరు మీపై పై కోర్టులో పిటీషన్ దాఖలా ఆస్తి నిమిత్తము క్లెయిమ్ పిటీషన్ వేసియున్నారు. సదరు పిటీషన్ **తేదీ: 22-10-2025న** శ్రీ కోర్టువారు వాయిదా వేయింపించియున్నారు. వాయిదా దినం ఉదయం **10.30 గంటలకు** మీరు గాని, మీ వలన ఆర్డరు పొందినవారు గాని, మీ తరుపున ప్లీడరుగారు గాని, పై కోర్టులో హాజరు అయ్యి మీ తరుపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై పిటీషన్ పరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సాలూరు,
తేదీ: 17-10-2025

గోర్లె కిరణ్ కుమార్,
పిటీషనరు తరుపు న్యాయవాది,
సాలూరు.